క్లుప్తంగా

ఘనంగా గొంతెమ్మ జాతర



వెదురుమూడిలో కుంతీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

కపిలేశ్వరపురం: మాల సామాజిక వర్గీయులు భక్తిశ్రద్ధలతో ఆరాధించే దేవత గొంతెమ్మ. గ్రామ నడివీధుల్లోని ఆలయాల్లోకి ప్రవేశం లేని ఆనాటి రోజుల్లోని సామాజిక అణచివేత నేపథ్యం నుంచి గొంతెమ్మ ఆరాధన మాల సామాజిక వర్గీయులకు ఆలవాలమైంది. మహాభారతంలోని పాండవుల తల్లి, పాండురాజు భార్య కుంతీదేవిని గొంతెమ్మగా ఆరాధిస్తారు. వెదురుమూడిలో శుక్రవారం కుంతీదేవి జాతర వైభవంగా ప్రారంభమైంది. ఆలయంలోని అమ్మవారి ప్రతిమ అయిన కుండను గ్రామ వీధుల్లో ఊరేగించారు. 16 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న జాతర కావడంతో ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం గ్రామానికి చేరుకున్నారు. దళితవాడ వీధులన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. గారడీ నృత్యాలతో గ్రామ వీధులు మార్మోగాయి.

కొండమూరి సేవలు చిరస్మరణీయం



అంగరలో కొండమూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: దీర్ఘకాలంగా కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లోని గ్రామాల ప్రజలకు వైద్య సేవలందించడమే కాకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలలా ప్రైవేటు ప్రాక్టీషనర్స్‌ను తయారు చేసిన కొండమూరి నరసింహమూర్తి చిరస్మరణీయుడని ప్రజాప్రతినిధులు, పీఎంపీ వైద్యులు అన్నారు. అంగరలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కొండమూరి సేవలను పలువురు కొనియాడారు. గ్రామంలోని ఆయన విగ్రహానికి అంగర నీటి సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి సూరిబాబు, పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అయిల మహేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి సత్తిపండు, మండపల్లి నారాయణరావు యశ్వంత్ శంకర్ పాల్గొన్నారు.

మే నెల వేతనం అందించాలని వినతి



ఎమ్మెల్యే వేగుళ్లకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం (మండపేట): ఏడాది పొడవునా వేతనాలను చెల్లించాలని, మే నెలను మినహాయించి 11 నెలలు మాత్రమే వేతనాలివ్వడం సరికాదంటూ ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు విన్నవించారు. మండపేట పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటిపల్లి రాంబాబు మాట్లాడుతూ తమ పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, మే నెలలో సైతం వేతనాలను చెల్లించాలని, సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, సత్యమూర్తి, సింగ్, సత్యనారాయణ ఉన్నారు.

కాలం చెల్లిన మందుల సరఫరాపై దర్యాప్తు

అనపర్తి : మండలంలోని పొలమూరు వెల్‌నెస్ సెంటర్‌లో కాలం చెల్లిన మందులు సరఫరా చేస్తున్నారంటూ గ్రామస్తులు చేసిన ఆరోపణలపై సోషల్ మీడియాలో కథనాలు రావడంతో జిల్లా వైద్యారోగ్యశాఖ స్పందించింది. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కోమలి శుక్రవారం పొలమూరు వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చి దర్యాప్తు చేశారు. మందులను పరిశీలించారు. నివేదికను తయారు చేసి జిల్లా అధికారులకు అందజేసి దోషులపై చర్యలకు సిఫారసు చేస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట డీపీఎంవో శ్రీవల్లి తదితరులు ఉన్నారు.

సరస్వతీ నదీ పుష్కరాలకు మనమూ వెళ్దాం

రామచంద్రపురం రూరల్: ఈ నెల 15 నుంచి 26 వరకు జరగనున్న కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాలకు రామచంద్రపురం ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులు నడపనుంది. వరంగల్లు భద్రకాళీ మాత ఆలయం, వేములవాడ రాజరాజేశ్వరీ అ మ్మవారి ఆలయం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, కాళేశ్వరం మహా కాళేశ్వరాలయం, పుష్కర స్నానం, రామప్ప దేవాలయ దర్శనంతో 3 రోజుల యాత్రకు రూ. 2,300 టికెట్టు ధర నిర్ణయించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు 955032426, 7997908887.

ప్రభుత్వం గొప్పలు.. రైతులకు తిప్పలు

- అక్కరకు రాని కొనుగోలు కేంద్రాలు
- ధాన్యం కొనటం లేదంటూ అన్నదాతల ఆందోళన
- 50 శాతం పైబడి కళ్లాల్లోనే ఉండిపోయిన ధాన్యం
- వర్షాల భయంతో ఆందోళన, ప్రభుత్వ తీరుపై రైతన్నల నిరసన



ఒంటితాడిలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలంటూ నిరసన తెలుపుతున్న రైతులు



కాజులూరులో కొనుగోళ్లు లేక ధాన్యాన్ని ఆరబెట్టి రాశులుగా పోస్తున్న రైతులు

కాజులూరు: ఆరుగాలం శ్రమించి పంట పండించటం ఒక ఎత్తయితే, ఆ పండించిన పంటను విక్రయించి సక్రమంగా సొమ్ము చేసుకోవటం మరొక ఎత్తు. పంట పండే సమయానికి ధాన్యానికి సరైన మద్దతు ధర రాకపోవటంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రైతులు అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో దళారులు కమీషన్ల రూపంలో రైతుల శ్రమను నిలువునా దోచుకుంటున్నారు. అయితే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తమ ఫలసాయాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందవచ్చంటూ ఇటీవల ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. అయితే ప్రస్తుతం నిర్వహణ వ్యవహారంలో లోపాలు తలెత్తడంతో ఈ కేంద్రాలు రైతులకు అక్కరకు రావడంలేదు. రైతు పండించిన ప్రతి గింజా మద్దతు ధరకు కొనుగోలు చేస్తామంటూ ప్రజా ప్రతినిధులు, అధికారులు గొప్పలు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం 75 కేజీల బస్తాకు రూ. 1725 ఇస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ రైతులు మార్కెట్లో బస్తా రూ.1500కే అమ్ముకోవలసి వస్తోంది. కాజులూరు మండలంలో ఈ ఏడాది సుమారు 19 వేల ఎకరాల్లో రైతులు సాగు చేపట్టారు. 90 శాతం మాసూళ్లు పూర్తవగా సుమారు 55 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే మిల్లులకు చేరిందని అధికారులు లెక్కలు వేస్తుండగా మిగిలిన ధాన్యం పొలాల మధ్య దిమ్మలపైన, గట్టపైన ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉంది. కొనుగొల్లు సక్రమంగా జరగకపోవటంతో ధాన్యం అమ్మకాలు నిలిచిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కాజులూరు మండలంలో 23 ఆర్‌బికేలు ఉండగా వాటిలోని 21 కేంద్రాల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాస్తవానికి ఇప్పటి వరకూ కేవలం ఏడువేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయాలు జరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో జట్టీలు లేకపోవటంతో కొనుగోళ్లు సక్రమంగా జరగటం లేదని సిబ్బంది చెబుతుండగా మిల్లర్లు ప్రభుత్వానికి బీజీలు చెల్లించకపోవటం, కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన ట్రాక్టర్లను సమయానికి అన్‌లోడ్ చేయకపోవటంతో విక్రయాలు మందకొడిగా జరుగుతున్నాయన్నది వాస్తవం. రైతులు ధాన్యం వ్యాపారులకు విక్రయించినట్లయితే వారే నేరుగా పొలం వద్దకు జట్టు పని వారితో వచ్చి ధాన్యం తూకం వేసుకుని తీసుకెళ్తుంటారు. అయితే ప్రస్తుతం ధాన్యం వ్యాపారుల ద్వారా కూడా కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ధాన్యం అమ్మకాలు మందకొడిగా జరుగుతుండటంపై ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ పాలకులు ఏమీ పట్టించుకోవటం లేదని, దేశానికి రైతే రాజు, రైతే వెన్నెముక అంటూ వేదికలపై ప్రసంగాలు చేయడం తప్ప తమను ఆదుకోవటం లేదంటూ రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

ధర తగ్గించి కొంటున్నారు



ప్రభుత్వం కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ. 1725 ప్రకటించింది. అయితే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవటంతో మిల్లర్లు దళారుల ద్వారా రూ. 1500కే కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో ధాన్యంలో తేమ శాతం తగ్గిందని, ధాన్యం రంగుమారిందని సాకులు చూపిస్తూ మరో రూ. వంద వరకూ కత్తిరిస్తున్నారు.

– కొప్పుల సత్యనారాయణ, రైతు, గొల్లపాలెం

వర్షాలు ఆందోళన కలిగిస్తున్నాయి



నేను ఐదు ఎకరాలు సాగు చేస్తున్నాను. మాసూళ్లు పూర్తయి 15 రోజులు కావస్తున్నా . కొనుగోళ్లు జరగకపోవటంతో ధాన్యం పొలంలోనే రాశుల రూపంలో ఉండిపోయింది. వర్షాలు మరింత భయాందోళనలు కలిగిస్తున్నాయి. తరచూ ధాన్యం రాశులు ఆరబెడుతూ మరలా గడ్డి, బరకాలు కప్పి రాశులుగా పోసి ఉంచుతున్నాను. ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తోంది. త్వరితగతిన పంట కొనుగోలు చేయాలి.

– పెదిరెడ్డి వెంకటరమణ, రైతు అయితపూడి

రైతు సమస్యలను పట్టించుకోవటం లేదు



ధాన్యం విక్రయాలు నిలిచిపోవటంపై రైతులతో కలసి ఆందోళనలు చేపడుతున్నాం. పాలకులకు వినతిపత్రాలు అందించాం. అయినా మార్పు రావటంలేదు. రోజురోజుకీ పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సరిపోక రైతులు ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతుంటే కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరగక తక్కువ ధరకు అమ్ముకోవసి వస్తోంది. దీంతో నికర ఆదాయం తగ్గి రైతులు అప్పులపాలవుతున్నారు.

– వల్లు రాజబాబు, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రెడ్డి సందీప్ త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు



రెడ్డి రాధాకృష్ణ నివాసంలో ప్రార్థన చేస్తున్న మైనారిటీ సెల్ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజుబాబు) తనయుడు సందీప్ త్వరగా కోలుకోవాలంటూ పలువురు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండపేటలోని వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం నేతలు శుక్రవారం రాధాకృష్ణను పరామర్శించారు. సందీప్ త్వరితగతిన కోలుకోవాలని కాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు చేసివారిలో హాజీ మొహమ్మద్ ఉమర్, సయ్యద్ రబ్బాని, షేక్ ఆలీఖాన్‌బాబా, గౌస్ మొహిద్దీన్, షేక్ ఇమామ్ సాహెబ్, సాహస్తే హుస్సేన్, సయ్యద్ ఖాదర్ ఆలీ, అర్షాద్, అన్సార్ ఆలీ ఉన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

కపిలేశ్వరపురం (మండపేట): పాలతోడు పాకలు గ్రామానికి చెందిన పేద కుటుంబానికి మారేడుబాకలోని జీఎస్ ఇండస్ట్రీస్ అధినేత గుత్తుల గోవిందరాజు సాయమందించారు. 70 ఏళ్ల వయస్సులో ఆర్థిక వనరులు లేకున్నా తన కష్టంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న గుత్తుల జానకిరామయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న గోవిందరాజు రూ.5 వేల నగదు, నిత్యావసర సరుకులను జానకిరామయ్య కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు పాల్గొన్నారు.

చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం



వెదురుమూడిలో చిన్నారుల తల్లులతో మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కపిలేశ్వరపురం: పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు అన్నింటిలో చలాకీగా ఉంటారని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్టు అంగర సెక్టార్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి, శ్రమ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ నాగేశ్వరి, ప్రథమ్ ప్రతినిధి సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్త ఎం.జానకీదేవి అన్నారు. సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో వెదురుమూడిలో నిర్వహించిన సంసిద్ధం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడతాయన్నారు.

వడగాల్పులపై నేడు అవగాహన సదస్సులు

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వేసవి ఎండలు, వడగాల్పుల నుంచి రక్షణ పొందేందుకు శనివారం ఆయా పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ జి. వెంకటసరోవరరావు శుక్రవారం తెలిపారు. ప్రతి గ్రామస్థాయి, సచివాలయ పరిధిలోని అధికారి ఈ సదస్సుకు హాజరై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు సంబంధించిన వివరాలను గ్రామస్తులకు వివరించాలన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, వడగాల్పుల బారినపడ్డ వారు ఇంటి వద్ద తక్షణం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులను దగ్గరలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లడం, వారికి తగు చికిత్స అందించడం వంటి మెలుకువలను నేర్పించాలన్నారు. ఈ అవగాహన సదస్సులు గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



పసలపూడిలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులు

రాయవరం: పసలపూడిలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఈ నెల 13న ఆరు నుంచి 14 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరాన్ని యూటీఎఫ్, సీఐటీయూ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు మంచి అలవాట్లు, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, డ్రాయింగ్, క్రాఫ్ట్, పాటలు పాడడం, నృత్యాలు, గణితం పజిల్స్, సైన్స్ ప్రయోగాలు తదితర అంశాలపై శిక్షణనిస్తున్నారు. ఈ శిక్షణ శనివారంతో ముగియనుందని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కడలి శ్రీనివాసరావు, సీఐటీయూ మండల శాఖ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మిలు తెలిపారు. శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులు పి.తిరుమలరావు, జి.మురళీకృష్ణ, కిలపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలేరమ్మ వీధి సంబరాలకు శ్రీకారం



అమ్మవారి ఆలయంలో వీధి సంబరాలను ప్రారంభిస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులు

కాజులూరు: మండలంలోని ఆర్యావటంలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న గ్రామదేవత పోలేరమ్మతల్లి అమ్మవారి జాతరకు సంబంధించిన వీధి సంబరాలను శుక్రవారం నిర్వాహక కమిటీ సభ్యులు ప్రారంభించారు. ప్రధాన ఉత్సావాలు ముగిసే వరకూ వీధి సంబరాలు అమ్మవారి గరగ నృత్యాలతో ప్రతిరోజు పరిసర గ్రామాల్లో ఊరేగుతుంటారు. గ్రామంలో సుమారు 300 సంవత్సరాలక్రితం వెలసిన పోలేరమ్మ తల్లిని ప్రజలు గ్రామదేవతగా కొలుస్తారు. 24వ తేదీ శనివారం రాత్రి కాపు సామాజిక వర్గీయులు చిన్న జాతర, 25వ తేదీ ఆదివారం రాత్రి శెట్టిబలిజ సామాజిక వర్గీయుల పెద్ద జాతర నిర్వహించి 26వ తేదీ సోమవారం తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆర్యావటం పరిసరాల్లోని కరప, కాజులూరు మండల గ్రామాల నుంచి సుమారు పదివేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

పారిశుధ్య పరిరక్షణతో డెంగీ నివారణ



మండపేట ర్యాలీలో పాల్గొన్న హెల్త్ వర్కర్లు



అంగరలో ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం (మండపేట): పారిశుధ్య పరిరక్షణతో డెంగీ తదితర విష జ్వరాలను నివారించవచ్చని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కమిషనర్ రంగారావు ఆదేశాలతో పట్టణంలో వ్యాధుల వ్యాప్తిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెయిన్‌రోడ్డు మీదుగా నిర్వహించిన ఈ ర్యాలీలో మున్సిపల్ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ

కపిలేశ్వరపురం: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. డెంగీ డే సందర్భంగా శుక్రవారం ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. అంగర పడమర ఖండ్రిక గ్రామాల వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి సీహెచ్ సూర్యారావు, ల్యాబ్ టెక్నీషియన్ ఆలీ, వైద్య, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

రాయవరం: జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీల వైద్యాధికారులు అనిరుథ్, ఎం.శ్రీనివాస్, మణికంఠ నేతృత్వంలో డెంగీపై అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు అనిరుథ్, శ్రీనివాస్, మణికంఠ మాట్లాడుతూ ఆడ ఎడిస్ ఈజిప్ట్ దోమ కాటుతో డెంగీ వ్యాధి వస్తుందన్నారు. పగటి పూట కుట్టే దోమల వలన మాత్రమే డెంగీ బారిన పడతామన్నారు. దోమ కుట్టిన ఐదు రోజుల నుంచి ఎనిమిది రోజులకు వ్యాధి లక్షణాలు బయటపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ నివాస ప్రాంతాల పరిసరాల్లో అపారిశుధ్య పరిస్థితులు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా అధికారి సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈవో తులసీదాస్, సూపర్‌వైజర్ గోపాలకృష్ణ, రాయవరం, మాచవరం పీహెచ్‌సీల వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు గంధం సిస్టర్స్ నృత్య ప్రదర్శన



గంధం సిస్టర్స్ తనుశ్రీ, బ్రహ్మణి

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లికి చెందిన (ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న) చిన్నారులు గంధం సిస్టర్స్ తనుశ్రీ (8), బ్రహ్మణి (5) కూచిపూడి నృత్యంలో ప్రావీణ్యులు. నృత్యంలో 10 ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్న వీరు అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి ఎ కన్వెన్షన్ హాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ అయిదు రకాల నృత్య ప్రదర్శనలు చేయనున్నారు. ఇదే వేదికపై కూచిపూడి అరంగ్రేట మహోత్సవాన్ని కూడా నిర్వహించనున్నారు. కూచిపూడి, భరత నాట్యం, పేరణి, ఫోక్ (జాన పదం), రాజస్థాన్ జానపద నృత్యం ఇలా అయిదు రకాల నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నారు. నాట్య గురువు, సత్యభామ అవార్డు గ్రహీత సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో గంధం సిస్టర్స్ నిర్వహించబోయే నృత్య ప్రదర్శనకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ ఇండియా కో ఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి రంగా న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నారని ఆ చిన్నారుల తల్లిదండ్రులు గంధం ఆదినారాయణ, దేవి దంపతులు తెలిపారు. తండ్రి ఆదినారాయణ ప్రస్తుతం హైదరాబాద్‌లో సినిమా రైటర్‌గా పని చేస్తున్నారు. నృత్యాభిమానులు ఈ నృత్య ప్రదర్శనను తిలకించి తమ పిల్లలను ఆశీర్వదించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

భూ వివాదం.. కౌలు రైతుకు తీరని నష్టం



చెరువులో చనిపోయిన చేపలను చూపుతున్న కౌలు రైతు సురేష్‌బాబు

తాళ్లరేవు: భూ యజమానుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా కౌలు రైతుకు తీవ్ర నష్టం సంభవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పటవల గ్రామ పంచాయతీ ఈబీసీ కాలనీ సమీపంలో ఉన్న చెరువులను అదే గ్రామానికి చెందిన పొట్టిపోతుల సురేష్‌బాబు (నాని) అనే కౌలు రైతు సాగు చేస్తున్నాడు. వరసకు మావయ్య అయిన ఆలపాటి శ్రీనివాసరావు అనే వ్యక్తి వద్ద లీజుకు తీసుకుని గత 12 ఏళ్లుగా చేపల చెరువు సాగు చేస్తున్నాడు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా చేపల సాగు చేపట్టాడు. అయితే ఆ చెరువును తాను కొన్నానని ఖాళీ చేయాల్సిందిగా రాంబాబు అనే వ్యక్తి గత 20 రోజులుగా వత్తిడి చేస్తున్నారు. తనకు లీజుకు ఇచ్చిన వ్యక్తి అనారోగ్యం కారణంగా బెంగళూరులో చికిత్స పొందుతున్నారని, ఆయన వచ్చి చెప్పిన తర్వాత ఖాళీ చేస్తానని సురేష్‌బాబు తెలిపారు. గత మూడు నెలలుగా చేపల సాగుకు సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశానని, మరో మూడు నెలల్లో పంట చేతికి వచ్చాక చెరువును ఖాళీ చేస్తానని, లేకపోతే తీవ్రంగా నష్టపోతానని కౌలు రైతు చెప్పాడు. అయితే చెరువును కొనుక్కున్న వ్యక్తి ససేమిరా అనడంతో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో కొంత మంది వ్యక్తులు చెరువులో నీటిని దౌర్జన్యంగా ఇంజన్లతో తోడేయడంతో చెరువులో ఉన్న చేపలు మృత్యువాత పడ్డాయి. భూ యజమానుల తీరుతో తాను తీవ్రంగా నష్టపోయానని కౌలురైతు సురేష్‌బాబు శుక్రవారం విలేకరుల వద్ద బోరున విలపించాడు. అధికార యంత్రాంగం స్పందించి తనకు న్యాయం చేయాలని కౌలురైతు కోరుతున్నాడు. ఇలా ఉండగా సర్వే నంబరు 380–1బిలోని 53 సెంట్ల భూమిని తాను కొనుగోలు చేసానని, అయితే ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో చల్లా రాంబాబు అనే వ్యక్తికి విక్రయించినట్లు ఆలపాటి సతీష్‌కుమార్ తెలిపారు. ఆ భూమికి సంబంధించిన పత్రాలన్నీ తమ వద్ద ఉన్నాయని, గత కొన్ని రోజులుగా కోరుతున్నప్పటికీ చెరువును ఖాళీ చేయకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సతీష్‌కుమార్ ఆరోపించారు.

కోనసీమ సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేయాలి



మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి సత్తిబాబు

అమలాపురం టౌన్: కోనసీమ సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేయాలని, జిల్లా ఏర్పడిన నాటి నుంచి కోనసీమ ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని సీపీఐ జిల్లా ఇన్‌చార్జి డేగా ప్రభాకర్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ ప్రతినిధి పెద్దిరెడ్డి రాము అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం జరిగిన పార్టీ జిల్లా సమితి సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. సీపీఐ నేత తాటిపాక మధు, పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ కోనసీమ వ్యవసాయ ఆధారిత జిల్లా కాబట్టి ఆ దిశగా అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకతను వివరించారు. పారిశ్రామిక అభివృద్ధికి కోనసీమ నూరు శాతం అనువైనదని పేర్కొంటూ ఆ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో నేటి ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. కోనసీమ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అంశంపై ఈనెల 25న అమలాపురంలో జరగనున్న సదస్సులో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి సత్తిబాబు అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దేవా రాజేంద్రప్రసాద్, కె.రామకృష్ణ, జి.రవికుమార్ తదితరులు మాట్లాడారు.